అంతే! అంతే!

(మే 2006, "విపుల" మాస పత్రిక)

పెద్దలమాట చద్దిమూట. చిన్నప్పుడు చిన్నస్కూల్లో చిన్న తరగతిలో చిన్నపుస్తకంలో చదువుకున్న పెద్ద విలువైన మాట. ఔను... అక్షర లక్షలు చేసే మాట. కానీ తన కొడుకు తన మాట విని పించుకోడే!... అమెరికా వెళ్ళి చదువుకునే పరీక్షలేవో రాస్తాట్ట. సీటొస్తే పంపించాలిట... ఇంజనీరింగ్ అయిపోయిగానే ఉద్యోగ ప్రయత్నం చెయచ్చు కదా. అంతగా పై చదువులు చదవాలనుంటే ఇక్కడే ఈ దేశం లోనే చదువుకోవచ్చు కదా? ఆ దేశం వెళ్ళి చదువైపోగానే చక్కావెనక్కొస్తాడని ఇక్కడే ఉద్యోగమో సద్యోగమో చూసుకుంటాడని గ్యారంటి ఏముంది? అక్కడ ఉద్యోగం చూసుకుని మెల్లిగా పాతుకుపోడూ? ఆ తర్వాత తన తమ్ముడిని కూడా లాగెయ్యడూ అక్కడికి? ఉన్నదే వీళ్ళిద్దరు సంతానం తనకి.. ఉన్న ఇద్దరూ తన కంటి ముందు ఉండకపోతే ఎలా? సొంత ఊళ్ళో తన వాటా పొలం అమ్మేసి ఈ పట్నంలో అపార్టుమెంటు కొని... గొర్రెకు బెత్తెడే తోక అన్నట్టు ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగం అయినా.. చాలీచాలని జీతాలైనా ఏదో ఇలా ఇక్కడే స్థిరపడిపోయాడు తను.

అన్నయ్య మాత్రం తన పొలం తనే చూసుకుంటూ సొంత ఊళ్ళో సొంత ఇంట్లో ఉండిపోయాడు. అన్నయ్యకీ తనకీ వయసులో తేడా ఎక్కువ ఉంది.

తన తాహతుకి తగ్గ సంబంధాలు చూసి కూతుళ్ళిద్దరికీ చేసేశాడు అన్నయ్య వాళ్ళు కూడా దుప్పటి ఎంతుందో కాళ్ళు అంతే చాపుకోవాలని అర్థం చేసుకునే మనస్తత్వం ఉన్నవాళ్ళు కాబట్టి తృప్తితో సంతోషంగానే ఉన్నారు.

నాన్నగారు సొంత ఇంట్లో అన్నయ్య దగ్గరే...

అమ్మ పోయింది...

ఆయన్ని ఇక్కడికి రమ్మంటే, ఆ పిచ్చిక గూళ్ళ ఇళ్ళల్లో నేనుండలేను, ఆ పట్నంలో నీళ్ళకీ కరువే మంచిగాలికీ కరువే, అంటూ ఎప్పుడూ రారు.

ఆ పల్లెటూరికి మేము రాలేం మా సెలవలన్నీ వేస్టయిపోతాయి. ఇక్కడ మా స్నేహితులతో సరదాగా గడుపుతాం అంటూ సెలవల్లో నాలుగు రాజులు వెళ్ళొద్దామన్నా పిల్లలు రామంటారు అసలు ఎనిమిదో తరగతికి వొచ్చినప్పట్నించీ పిల్లలకి సెలవలే కరువయ్యాయి. ఈ కోచింగు ఆ కోచింగు.. ఈ పరీక్షలు ఆ పరీక్షలూ అంటూ సెలవలంతా బిజీయే. ఏదో ఓ నాల్రోజులన్నా తీసుకుపోదామంటే అక్కడేం తోచదని ఏడుపు. ఇంకవాళ్ళని ఊరికి తీసికెళ్ళే ప్రసక్తే రానివ్వలేదు పరిస్థితులు.

ఈ తరం పిల్లలకి మూడో ఏటనించే మీద పడిపోయింది కదా చదువు భారం.

తన పిల్లలు తాతయ్య పక్కన పడుకుని కథలూ కబుర్లూ చెప్పుకోలేదు. పల్లెటూళ్ళో తోటల్లో పొలాల్లో పరుగులెత్తలేదు. తాజాగా చెట్లనించి అప్పటికప్పుడు కోసుకుని ఏ పళ్ళూ తిన్లేదు.

తనూ అన్నయ్యా తమ తోటి పిల్లలూ ఎలా గంతులేసి ఆడేవారు ఆ తోటల్లో ఆరోగ్యకరమైన అల్లర్లు తమవి ఆనాడు. ఎంతబాగా సరదాగా గడిచంది బాల్యం! మధురమైన రోజులు ఆ మరపురాని బాల్యం!....

తన పిల్లల బాల్యం రెండు పంజరాల్లో గడిచింది ఈ పట్నంలో ఒకటి గాలీ వెల్తురూ కూడా సరిగ్గా రాని పిచ్చిక గూడు ఫ్లాట్ రెండు ఆడుకునేందుకు జాగాయే లేని అంతస్తు మీద అంతస్తులో ఇరుకు గదుల పాఠశాల.

మారినకాలం... మారిన పరిస్థితులు.. పోటీ.. పోటీ అన్నిటా పోటి. వ్యాపారస్తుల మధ్య పోటీ... టీ.వీ. ఛానల్సు మధ్య పోటీ.. వైద్య విధానల్లో పోటీ ఎందులో చూసినా పోటీ తత్వం ఆ తత్వం ఆరోగ్యకరమైనదైతే... సామాన్య మానవుడికి హాని కరం కానిదైతే మంచిదే... కానీ అగమ్యగోచర పరిస్థితిలోకి నెట్టేస్తుంటే దిక్కుతోచక నలిగి పోతున్నాడు సామాన్యుడు.

తన ఆలోచనలకి తనకే నవ్వొచ్చింది సారథికి. ఇన్నాళ్ళకి ఇన్నేళకి ఇప్పుడిలా ఎందుకావేశం వొస్తోంది తనకి? తన కొడుకు దేశం వొదిలి. తనకంటి ముందునించి దూరంగా వెళ్తానని అన్నందుకేగా?

అప్పుడప్పుడు ఒంటరిగా కూచున్నప్పుడు ఈ మధ్య సొంత ఊరు, ఆ ఊరు గురించిన ఆలోచనలు ఎక్కువగా వొస్తూనే ఉన్నాయి.

అన్నయ్యకీ వదినకీ గొంతెమ్మ కోరికల్లేవు హాయిగా నిశ్చింతగాఉన్నారు. పెద్ద ఇల్లు... ఇంటి చుట్టూ కావల్సినంత జాగా... చెట్లు... ఇంట్లో పాడి... పాలేరు.. పొద్దున్నించీ రాత్రి దాకా ఉండి అన్ని పన్లూ చేసిపెట్టే గంగమ్మ..

పెరట్లో కాసే కూరలూ... పూసేపువ్వులూ... ఎప్పుడూ నీళ్ళకి లోటులేని, ఎండిపోని నుయ్యి, దాంతో పాటూ కొళాయి కూడా ఎప్పుడైనా అన్నయ్య గానీ వదిన గానీ ఈ ఊరొచ్చినా రెండురోజులు కంటే ఉండలేరిక్కడ. వాళ్ళీ ఊర్నించి కొనుక్కెళ్ళేది నగలూ బట్టలూ కాదు.. మంచి సాహిత్యం.. అక్కడింట్లో ఒక గదిలో పూర్తిగా పుస్తకాల బీరువాలే...

అక్కడ అన్నయ్య జీవితంలో నిశ్చింత ఉందనీ.. ఇక్కడ తన జీవితంలో ప్రశాంతత లోపించిందనీ తరచుగా తనకి అనిపిస్తోంది అంటే ఎక్కడో మనసు పొరల్లో.. తను కూడా అక్కడే ఉండి పోయి ఉంటే బావుండేదన్న చిన్న కోరిక దాక్కుని ఉందన్నమాట.

అన్నయ్య డిగ్రీ చదువైపోగానే నాన్నగారు చెప్పారు. ఉద్యోగం అంటూ ఎక్కడికీ పోవద్దురా. మనకున్న పొలం మనమే చూసుకుంటూ ఇంకోళ్ళ మీద ఆ పని కోసం ఆధారపడకుండా ఉండడం కూడా ఒక ఉద్యోగ మేరా అని అన్నయ్యకా మాట నచ్చింది విన్నాడు. అక్కడే ఉండిపోయాడు. తన డిగ్రీ అయిపోగానే కూడా నాన్నగారు తనకీ అదేమాట చెప్పారు. తను పట్నవాసం కావాలనుకున్నాడు పొలాలేవిటి? ఉద్యోగం చెయ్యాలనుకున్నాడు... అంతే పట్నం వొచ్చేశాడు.

“ఏమిటో తీవ్రంగా ఆలోచిస్తున్నారు... చాలా సేపట్నించి?” భార్య పార్వతి మాటల్తో ఈ లోకంలో కొచ్చాడు. సారథి.

“నేనో నిర్ణయం తీసుకున్నాను”

“ఏమిటో అది? అసలు దేన్ని గురించి?”

“వాసూని తీసుకుని రేపు బయల్దేరి మన ఊరెళ్ళొస్తానోసారి”

“ఎందుకు?”

“ఇప్పుడేవీ అడగద్దు నన్ను.. వొచ్చాక చెప్తాను” మాట పూర్తయిందో లేదో ఎక్కడికో వెళ్ళిన వాసు వొచ్చాడప్పుడే.

కొడుకుని పిల్చాడు సారథి.

“ఒరే వాసూ! రేపు రైలుకి బయల్దేరి మనిద్దరం మనూరెళ్ళొద్దాం”

“మన ఊరా?” గుండెల్లో రాయిపడింది వాసుకి

“ఔను.. రెండు రోజుల్లో వొచ్చేద్దాం” ఇంక అంతకంటే ఎక్కువ మాట్లాడలేదు సారథి.

అమ్మ వెనకే వంటింట్లోకి నడిచాడు వాసు.

“అమ్మా!”

“ఏవిట్రా?”

“ఇప్పుడెందుకమ్మా ఆ ఊరెళ్ళడం?”

“నాకేం తెల్సు?”

“రేపు మా ఫ్రెండ్సు కొంత మంది కల్సి చిన్న టూర్ ప్రోగ్రామ్ వేసుకున్నాం. రెండ్రోజుల ట్రిప్ నేను వెళ్ళాలమ్మా వాళ్ళతో సరదాగా”

“నేనేం చెయ్యనూ?”

“నేను రాలేనని నాన్నగారికి నచ్చచెప్పవా?”

“బావుంది నాయనా! కరవమంటే కప్పకి కోపం విడవమంటే పాముకి కోపం నన్నొదిలెయ్యి బాబూ!”

"ఇదన్యాయం అమ్మా"

"ఏదన్యాయంరా? అయినా పల్లెటూరి కెళ్ళడం చక్కగా పిక్నిక్కి వెళ్ళినట్టు ఉంటుంది కదరా. రెండు రోజులుండి రావడానికంత విసుగెందుకు? వారం పదిరోజుండమన లేదు కదా?"

"అమ్మా! మీతరం వేరు, మాతరం వేరు అది మర్చిపోతున్నావు నువు"

"తరాలు వేరైనా.. మరీ నీలాగా ఎవ్వరూ ఉండేరేమో?"

"ఎందుకు లేరూ? నా ఫ్రెండ్సు చాలా మందే ఉన్నారు"

"అయినా... జననీ జన్మ భూమిశ్చ అన్నారు కదురా పెద్దలు. సొంత ఊరంటే నీకసలు.."

"ఆగాగు మాతాశ్రీ... నేను పుట్టింది పెరిగిందీ ఉంటున్నదీ చదువు కుంటున్నదీ అన్నీ ఈ ఊరే కదమ్మా.. ఇదేనా సొంత ఊరు.."

"ఆ రూట్లో వొచ్చావా? ఇంక నీకు నేనేం చెప్పగలను? తెల్సిన వాడికి చెప్పచ్చు తెలియని వాడికి చెప్పగలం. తెలిసీ తెలియని వాడికి చెప్పడం కష్టం"

"అందుకే నాక్కాదు... నాన్నగారికి చెప్పమంటున్నాను" నవ్వాడు వాసు పార్వతి ఏదో అనబోతుంటే "నాకొద్దు నా కొద్దు" అంటూ పక్కింటి వాళ్ళ నాలుగేళ్ళ పాప పరిగెత్తుకొచ్చింది లోపలికి.

"ఏవిటి చిట్టీ ఏవిటి హడావిడి? ఏవిటొద్దు నీకు?"

"చూడు అంటీ.. నాకా పువ్వుల గౌనొద్దు.. తెల్ల గౌను వెయ్యమంటే వెయ్యట్లేదమ్మ... ఆటల్లో మాసిపోతుంది అంటోంది పువ్వుల గౌనే వేస్తానంటోంది...

"చూశావామ్మా?" పాయింటు దొరికింది వాసుకి.

"ఏవిట్రా?"

"తరాలు అంతరాలు"

"టీ.వీ సీరియల్ పేరులా ఉంది"

"అంత చులకనగా తీసి పడెయ్యకు మాతాశ్రీ టీ.వీ. సీరియల్ పేర్లు కూడా మన జీవితంలో భాగాలే"

"జీవిత సత్యాలు నీకన్నా నాకు బాగా తెల్సు గానీ అసలు విషయం చెప్పు"

"తరాలు అంతరాలు గురించేనా? నీకు తెలియనిదేం లేదు... అయినా చెప్పక తప్పదు నాకు తరానికి తరానికీ అంతరం ఉంటుంది కదా? ఈ చిన్న పిల్ల చిట్టి సంగతే చూడు. తన ఇండివిద్యుయాలిటీ తనకుంది. తన కిష్టమైన బట్టలే వెయ్యమంటుంది. తన కిష్టమైన కూరలే తింటా నంటుంది. తనకి నచ్చిన ఆటలే ఆడతా నంటుంది. ఇరుగు పొరుగు వాళ్ళల్లో కూడా తనకి నచ్చిన అంటీలతోనే మాట్లాడుతుంది. అంత చిన్న పిల్లలకే వాళ్ళ సొంత అభిప్రాయాలంటూ వాళ్ళకున్నప్పుడు మా వయసు వాళ్ళకి మా ఇండివిద్యుయాలిటీ మాకుండదా చెప్పు!"

"అయితే ఏవిటంటావ్?"

"అమ్మా! అంతా విని నువ్వా ప్రశ్న వెయ్యడం.. దీన్నే ఏదో అంటారని నువ్వే ఓసారి చెప్పావు"

"ఔను.... రామాయణం అంతా విని రాముడికి సీతేమవుతుందీ అని అడిగినట్టు...

"కరెక్టు... మరి రేపు నా సంగతి?"

"ఏవుందీ? ప్రయాణానికి బట్టలు సద్దుకోడమే.."

"కావాలంటే నువ్వూ నాన్నగారూ వెళ్ళి రండమ్మా"

"నీతో ఏదో పనుండి నిన్ను తీసుకెళ్తుంటే నన్ను వెళ్ళమంటావేంటి?"

"నాతో ఏం పనీ?"

"నాకేం తెల్సు? వెళ్ళాక నీకే తెలుస్తుందిగా! తినబోతూ రుచెందుకు అడగటం?

* * *

“మీరేవన్నా వాడికి నచ్చచెప్పగ లరేమో చూడండి నాన్నగారూ” నవ్వొచ్చింది శివరామయ్యకి కొడుకు సారథి మాటలకి.

“ఆ పాత కాలం ఆ రోజుల్లోనే కన్న కొడుకువు నీకే నచ్చచెప్పలేక పోయాను. ఇంక ఈ రోజుల్లో ఈ తరం పిల్లాడికి.... ముసలాడిని నా మాటలు నచ్చుతాయా? పైగా ఈ తాతా మనవల మధ్య అంత చనువూ అంత రాకపోకలు ఎక్కడున్నాయి? ఆ పట్నం వచ్చి ఉండటం ఇష్టం లేక నేనొచ్చి మీ ఇంట్లో ఉండలేదు. ఈ పల్లెటూరు పొడగిట్టక మీ పిల్లలొచ్చి ఇక్కడుండరు. ఎవర్నీ తప్పు పట్టడానికి వీల్లేని రోజులివి... ఎవరి ఇష్టాయిష్టాలు వారివి కాలమే అలా ఉంది...”

మనసులోనే అనుకుంటూ పైకి ఏమీ మాట్లాడలేదు శివరామయ్య.

“ఏవిటి నాన్నగారూ... మాట్లాడరేం? నచ్చచెప్తారా వాడికి?”

“ప్రయత్నిస్తానురా...”

* * *

“పెదనాన్నగారూ... మీకీ ఊళ్ళో ఎలా తోస్తుంది?

వరండాలో కూచునున్న పెద్దనాన్న దగ్గర చేరాడు వాసు

చిన్నగా నవ్వాడు కాంతారావు.

“నేను జవాబు చెప్పే ముందు నా ప్రశ్నకి నువ్వు జవాబు చెప్పాలి మొదట. నీకు మీ ఊళ్ళో ఎలా తోస్తుంది?”

“ఎందుకు తోచదూ? నా చదువులు నా స్నేహితులూ... షికార్లు... టీ.వీ. ఇంక తోచక పోడమా?”

“ఔనా? మరి నేనుండే ఊళ్ళో నా పనులూ... నా స్నేహితులూ... కాలవ గట్టుకి షికార్లు... చల్లటి గాలీ, మంచి గాలీ పీల్చుకుందుకు తిరిగి హాయిగా ఇల్లు చేరటం, ఇంట్లో టీ.వీ... ఇంత కాలక్షేపం ఉండగా ఇంకనాకు తోచకపోడమా? మీ తాతయ్యకి కూడా తోచక పోవడం అంటూ లేదు తెల్సా? ఆయన వయసు

స్నేహితులు ఆయనకున్నారు. పొద్దున్న ఓ గంట సేపు పూజ అయ్యాక పొలాని కెళ్ళానంటే మధ్యాహ్నందాకా అక్కడే సరిపోతుంది నాకు. వొచ్చి భోజనం చేసి ఓ కునుకు తీసి లేచాక నేనూ మీ పెద్దమ్మా తాతయ్యా ముగ్గురం కాఫీలు తాగుతూ చక్కగా కాసేపు కబుర్లు చెప్పుకుంటాం. మీ ఊళ్ళో మీరు నలుగురూ కాఫీలు తాగేటప్పుడు గానీ అన్నాలు తినేటప్పుడు గానీ కబుర్లు చెప్పుకుంటారా కాసేపైనా?"

"అది మాకు ఏ రోజూ ఏ పూట కుదిరే విషయం కాదు పెద్దనాన్నగారూ. ఎవరి టైములు వాళ్లవి".

"సాయంత్రాలు మొగవాళ్ళకి నేను, ఆడవాళ్ళకి మీ పెద్దమ్మ కొంత మందికి చదువు నేర్పుతాం... ఎవరొచ్చినా కాదనం... ప్రతి రోజూ చిన్నా పెద్దా చాలా మందే వొస్తుంటారు."

"రియల్లీ యూ ఆర్ గ్రేట్ పెద్దనాన్న గారూ".

"గొప్ప కోసం కాదు... మా తృప్తి కోసం చేస్తున్నాం. ఆ తర్వాత మా ముగ్గురికి నిద్రొచ్చేవరకూ మా పుస్తక పఠనాలు మాకున్నాయి. మంచి పుస్తకం మంచి స్నేహితుడితో సమానం కదా!"

"ఈ పల్లెటూళ్ళో మీకెలా తోస్తుందన్న పిచ్చి ప్రశ్న వేసినందుకు సిగ్గు పడుతున్నాను. కాలాన్నివ్యర్థం చెయ్యనివాళ్ళకి పల్లెటూరైనా పట్నమైనా ఒకటే అని అర్థమైంది. వ్యర్థం చేసే వాళ్ళు పట్నాల్లో ఉన్నా ఫలితం లేదు శుద్ధ దండగ అని తెల్సింది." నవ్వుతూ వాసు భుజమ్మీద చెయ్యి చేసి దగ్గరికి తీసుకున్నాడు కాంతారావు.

రాత్రి భోజనాలయ్యాక తాతయ్య పిలిస్తే ఆయన గదిలోకి వెళ్ళి కూచున్నాడు. వాసు.

"ఊ... ఏవిట్రా వాసూ! బి.టెక్ అయిపోవచ్చింది... ఇంక ఉద్యోగ ప్రయత్నాలు ... ఆ తర్వాత పెళ్ళి..."

"తాతయ్యా... అమెరికా వెళ్ళి చదువుకోవాలని కోరిక... ఉద్యోగానికి, పెళ్ళికి తొందర్లేదు.

“పై చదువులు చదువుకోవాలనుంటే.... దేశంలోనే చదువుకో... ఎక్కడికో వెళ్ళడం ఎందుకు?”

“ఛాన్సు దొరికితే కనక అక్కడే చదువు కుంటాను తాతయ్యా. అయినా నేనొకటి అడుగుతాను చెప్తావా?”

“అడుగు”

“పెద్దనాన్న గారి లాగానే నాన్న గారిని కూడా ఈ ఊళ్ళో ఉన్న మీ పొలాలు చూసుకుంటూ ఇక్కడే ఉండి పొమ్మని అడిగావటగా తాతయ్యా?”

“ఔను”

“నాన్నగారు ఆ మాట చెవిని పెట్టలేదు. చిన్నపాటి గుమాస్తా ఉద్యోగమైనా పర్వాలేదని పట్నం పరుగెత్తి అక్కడే ఉండి పోయారా లేదా?”

“ఔను”

“నాన్నగారు నీ మాట వినిపించుకోవట్లేదని... అప్పట్లో నాన్నగారిని మీ నాన్నగారి దగ్గరికి పంపించావా తాతయ్యా ఆయన చేత చెప్పించడానికి?”

“లేదు” తెల్ల మొహం వేసి చూశాడు శివ రామయ్య.

“మరి మా నాన్నగారెందుకు నీచేత చెప్పించాలని చూస్తున్నారు?”

నోట మాట రాలేదాయనకి.

నవ్వుతూ తాతయ్య చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు వాసు.

“నీ మీదగానీ నాన్నగారి మీద గానీ కోపంతో నేనీ మాట అడగలేదు తాతయ్యా. అడిగిస్తున్నందుకు ఆయన్ని అడిగినందుకు నిన్ను తప్పు పట్టట్లేదు నేను.

ఆ రోజుల్లో నాన్నగారు పట్నం వెళ్తానన్నప్పుడు అది నీకు అమెరికాతో సమానం అని నేనర్థం చేసుకోగలను. నాన్నగారికది... ఆయన పాలిటి గొప్ప వరం... దొరికిన ఛాన్సు ఎందుకొదులుకోవాలని గంతులేసి ఉంటుందాయన మనసు... మరి... ఈ కాలం పిల్లలకి... మాలాంటి.. వాళ్ళకి అమెరికా అంటే

అదో పెద్ద పట్నం... పక్కనున్న పట్నం.... దానిముందు ఇప్పుడుండే పట్నం పల్లెటూరు కింద లెక్క.. అంతే... అఫ్.. కోర్సు ఎక్కడుండే సాదక బాధకాలు అక్కడుంటాయి.. కాదనను.. ఔనా కాదా నువ్వే చెప్పు తాతయ్యా..."

నిజమేననిపించింది శివరామయ్యకి. ఆ రోజుల్లో పట్నవే తన ప్రాణానికి అమెరికాతో సమానం. చిన్నవాడైనా మనవడు ఉన్న మాట చెప్పాడు. ఈ మాత్రానికి తన కొడుకెందుకంత బాధ పడిపోతాడు? ఎందుకంత కంగారు పడి పోతాడు? బిడ్డల్ని కనగలం గానీ వాళ్ళ రాతల్ని కనలేం కదా? చదువు పూర్తవగానే వాడు వెనక్కొస్తాడా? అక్కడే ఉద్యోగంలో చేరతాడా? అన్నది ఇప్పుడే వాడూ చెప్పలేదు. వెనక్కి తిరిగొచ్చి నీ దేశానికి నువ్వు సేవ చెయ్యి నాయనా అని చెప్పడం పెద్దవాళ్ళ బాధ్యత.. అది చెప్తాం...

తాతయ్య మనవడు కబుర్లు మొదలెట్టక ముందే కాసేపలా బయటి కెళ్లొద్దాం రమ్మని ఊళ్ళో ఉన్న ఇద్దరు ముగ్గురు దగ్గిరి బంధువులిళ్లకి తమ్ముడిని తీసుకుని బయల్దేరాడు కాంతారావు. వొచ్చేటప్పుడు ఆఖర్న రాఘవ రావుగారింటికి తీసికెళ్లాడు.

బయటినించి ఆ ఇల్లు చూస్తూనే ఆశ్చర్యపోయాడు సారథి అదివరకొకప్పుడు తను చూసిన ఇల్లులా లేదు. భవంతిలా మారిపోయింది.

"అప్పుడే ఏం చూశావు? లోపలికెళ్తే ఇంకా ఆశ్చర్యపోతావు. సినిమా సెట్టింగుల కంటే బ్రహ్మాండంగా కట్టించుకున్నాడు. హైద్రాబాద్‌లో ఓ చిన్న ఫ్లాట్ ఉండేది కదా వీళ్లకి.... అద్దెకిస్తుండేవారు.. ఈ మధ్య అది అమ్మేసి బాగా పెద్ద ఫ్లాట్ కొని ఎనిమిది వేలకి అద్దెకిచ్చారు. ముగ్గురు కొడుకులూ అమెరికాలోనే ఉన్నారుగా.. ఎడా పెడా పంపుతున్నారు డబ్బు.."

అంటూ రాఘవరావు బాబాయ్ ఏవేం స్థిరాస్తులు ఏర్పాటు చేశాడో ఇంకా ఏవేం ఏర్పాటు చేస్తున్నాడో లిస్టు చదువుతున్నాడు కాంతారావు.

అవన్నీ వింటుంటే సారథి ఆలోచన్లెటో పోయాయి. ఇంటికెళ్ళగానే తండ్రి గదిలోకి పరిగెత్తాడు. ఆయనొక్కడే ఉన్నాడు గదిలో.

“అమెరికా వెళ్లద్దని వాడికి నచ్చచెప్పేశారా నాన్నగారూ?” కొడుకు గొంతులో అంత కంగారెందుకో అర్థం కాలేదు శివరామయ్యకి.

“లేదురా”

“అమ్మయ్య...” స్థిమితపడ్డాడు సారథి.

“పోన్లెండి నాన్నగారూ.... వెళ్లమందాం.. వాడి ముచ్చట మనం ఎందుక్కాదనాలి? ఈ రోజుల్లో ఎంత మంది వెళ్లట్లేదూ? నలుగురితో పాటూ నారాయణా... అంతే కదా?”

బుర్ర గోక్కున్నాడు శివరామయ్య “అంతే అంతే” అనుకుంటూ.

★★ ★★ ★★